

డ్రాపౌట్స్ తగ్గింపునకు చర్యలు

బడి బయటి పిల్లల తగ్గింపునకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ పేర్కొన్నారు. - 8లో



ఇష్టారాజ్యంగా అక్రమ తవ్వకాలు

పాలసముద్రం మండలంలో ఎర్రమట్టి అనుమతుల పేరుతో కూటమి నేతలు దోపిడీకి పాల్పడుతున్నారు. - 8లో



చేపల పెంపకంతో ఆదాయం

కొరమీను చేపల పెంపకంతో మహిళలు అధిక ఆదాయం పొందవచ్చని డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి పేర్కొన్నారు. - 8లో

సాక్షి చిత్తూరు
గురువారం । 11 । సెప్టెంబర్ । 2025

న్యూస్‌రీల్

ఈనెల 15 వరకు ఇన్‌స్పైర్ మనక్ గడువు

చిత్తూరు కలెక్టరేట్ : ఇన్‌స్పైర్ మనక్ 2025–26లో విద్యార్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణకు ఈనెల 15వ తేదీ వరకు గడువు పొడిగించారని డీఈవో వరలక్ష్మి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులు గడువులోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు ఇన్‌స్పైర్ మనక్ కు దరఖాస్తు చేసుకునేలా హెడ్‌మాస్టర్లు చర్యలు చేపట్టాలని డీఈవో ఆదేశించారు.

ఉద్యోగ మేళాకు స్పందన



హాజరైన నిరుద్యోగులు

కార్వేటినగరం : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్ ఏపీ ఎస్.ఎస్.డి.సి సంయుక్తంగా శనివారం కార్వేటినగరం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టరేట్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఆనంద్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గోవర్ధన్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ విజయలక్ష్మి , సీడాప్ – ఏపీఎస్ఎస్డీసీ అధికారులు హాజరయ్యారు. ఈ జాబ్ మేళాలో వివిధ సంస్థలు పాల్గొని, అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాయి. మొత్తం 178 మంది అభ్యర్థులు పాల్గొనగా వారిలో 86 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి.

నేడు వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ విభాగ సమావేశం



తలారి రాజేంద్ర, వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు

తిరుపతి మంగళం : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు తిరుపతి పద్మావతీ పురంలోని పార్టీ కార్యాలయంలో చిత్తూరు, తిరుపతి జిల్లాల ఎస్సీ విభాగం నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నారు. బుధవారం ఈ మేరకు పార్టీ ఎస్సీ విభాగం ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు తలారి రాజేంద్ర మీడియాతో మాట్లాడారు. సమావేశానికి వైఎస్సార్‌సీపీ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్ బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు, ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గాల సమన్వయకర్తలు హాజరవుతారని వివరించారు.

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి



వ్రతంలో పాల్గొన్న భక్తులు

కాణిపాకం : కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో బుధవారం సంకటహర చతుర్థి గణపతి వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రధాన ఆలయ అలంకార మండపంలో సిద్ధి బుద్ధి సమేత వినాయక స్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు సంకటహర చతుర్థి గణపతి వ్రతాన్ని భక్తులతో జరిపించారు.

స్వర్ణరథంపై స్వామివారు...

స్వయంభు శ్రీకాణిపాక వరసిద్ధి వినాయక స్వామి శనివారం రాత్రి ఆలయ మాడవీధుల్లో స్వర్ణరథంపై కటాక్షించారు. ప్రధాన ఆలయంలో సాయంత్రం అలంకార మండపంలో ఉత్సవ విగ్రహాలకు ఆలయ అర్చక, వేద పండితులు ప్రత్యేకంగా అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను మేళతాళాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి స్వర్ణ రథంలో కొలువుదీర్చి ఊరేగించారు.

మిలటరీ స్కూళ్లలో ప్రవేశానికి దరఖాస్తులు

తిరుపతి సిటీ : రాష్ట్రీయ మిలటరీ స్కూళ్లలో 6, 9వ తరగతిలో ప్రవేశాలకు అక్టోబర్ 9వ తేదీలోపు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.విశ్వనాథ్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఇతర వివరాలకు తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం సైనిక్ స్కూల్, లేదా 86888 88802 / 93999 76999 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జిల్లాను జ్వరాలు వణికిస్తున్నాయి. ప్రతి ఇంటా జ్వరంతో ఇద్దరూ, ముగ్గురూ మంచం పట్టారు. పీహెచ్‌సీల్లో మందుల్లేక వైద్యం మొక్కుబడిగా మారింది. జ్వరానికి సైతం మాత్రలు, మందుల్లేక బయట కొనుక్కోవాల్సి రావడం రోగులను ఆందోళనకు గురి చేస్తోంది. దీంతో ప్రైవేటు ఆస్పత్రికి పరుగులు తీస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటింటికీ వెళ్లి నాడీపట్టి మందులు ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వంలో నేడు ఆసుపత్రికి వెళ్లినా మందుల్లేక విలవిల్లాడిపోతున్నారు.



మందుల్లేవ్!

- పీహెచ్‌సీల్లో అందుబాటులో లేని మందులు
- జ్వరానికి సైతం మందులు, మాత్రలు లేని వైనం
- ఇండెంట్ పంపినా సరఫరాలో జాప్యం
- సెంట్రల్ డ్రగ్స్‌లోనే కొరత అంటున్న వైద్యాధికారులు
- అవస్థలు పడుతున్న పల్లె జనం

కాణిపాకం : తరచూ కురుస్తున్న వర్షాలు, వాతావరణ మార్పుల కారణాలతో పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా జ్వరాలు ప్రబలుతున్నాయి. ప్రతి గ్రామంలో జ్వర పీడితులు ఉన్నారు. పేదలు వైద్యం కోసం పీహెచ్‌సీలకు వెళ్తే ఒకటి, రెండు మాత్రలు మినహా అత్యవసరమైన ఔషధాలు లభించడం లేదు. ఆరోగ్య కేంద్రాల్లో మందులు, మాత్రలు లేక వెలవెలబోతున్నాయి. కేంద్రాల నుంచి ఇండెంట్ పెట్టి నెలలు గడుస్తున్నా సరఫరా విషయంలో జాప్యం నెలకొంది.

జిల్లా వ్యాప్తంగా 50 పీహెచ్‌సీలున్నాయి. ప్రతి పీహెచ్‌సీకి నిత్యం 100–200 వరకు ఓపీలొస్తున్నాయి. 50–75 మంది వరకు దీర్ఘకాలిక వ్యాధులతో ఆసుపత్రులకు వస్తున్నారు. ప్రస్తుతం మలేరియా, డెంగీ, టైఫాయిడ్‌తో పాటు, విష జ్వరం, రోగాలు వ్యాపిస్తున్నాయి. ఇటీవల పీహెచ్‌సీలకు జ్వరం కేసులు అధికమయ్యాయి. దగ్గు, జలుబు, గొంతునొప్పి, ఇతర లక్షణాలతో క్యూ కడుతున్నారు. వీరికి వైద్య సేవలను అటు ఉంచితే...మందు బిళ్లలూ కరువయ్యాయి.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పీహెచ్‌సీలో మందులు, మాత్రలు ఫుల్‌గా ఉండేవి. కొరత వచ్చిన వెంటనే వాటిని అప్పటికప్పుడే భర్తీ చేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మందులు, మాత్రల కొరత వేధిస్తోంది. నెలల తరబడి మందులు, మాత్రల కొరత ఉన్నా పట్టించుకోవడంలేదు. సెంట్రల్ డ్రగ్స్‌లో కూడా ఇదే పరిస్థితి ఎదురవుతోందని వైద్యాధికారులు చెబుతున్నారు.

ప్రబలుతున్నా నిర్లక్ష్యమే

జిల్లాలో జ్వరాలు తాండవిస్తున్నాయి. చిత్తూరు, నగరి, జీడీ నెల్లూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో జ్వరాల కేసులు పెరిగిపోతున్నాయి. ఊరూరా జ్వరాలు ప్రబలుతున్నాయి. అయితే జ్వరాలతో పీహెచ్‌సీలకు వెళ్తే తగ్గడం లేదని బాధితులు చెబుతున్నారు. పీహెచ్‌సీలకు నిర్లక్ష్య జబ్బు అంటుకుంటోంది. జ్వరానికి మందులు, మాత్రలు లేని దుస్థితి ఏర్పడింది.

బయటకొనుక్కోండి

ఆరోగ్య కేంద్రాల్లో మందు బిళ్లలు లేక పల్లె ప్రజలు అవస్థలు పడుతున్నారు. జ్వరం, ఇతర నొప్పులతో ఆస్పత్రికి వస్తే...గంటల కొద్ది క్యూలో వేచి ఉంటున్నారు. ఆ తర్వాత ఏంటీ సమస్య అని అడిగి మందులు, మాత్రలు రాయిస్తున్నారు. ఈ చీటీని మందులు, మాత్రలు ఇచ్చే సిబ్బంది దగ్గరికి తీసుకెళ్తే ఇవీ లేవని బయటే తీసుకోవాలని చెప్పి పంపించేస్తున్నారు. డబ్బులు లేక వచ్చే వారు బయట మాత్రలు తీసుకోవాలంటే ఇబ్బందులు పడుతున్నారు. కీళ్ల, నొప్పులు, కండరాలు, శ్వాస సంబంధిత మాత్రలకు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

పడిపోతున్న ఓపీ

నిర్వహణలోపం, డాక్టర్ల అలసత్వం కారణంగా పీహెచ్‌సీలో ఓపీల సంఖ్య గణనీయంగా పడిపోతోంది. పీహెచ్‌సీల్లో డాక్టర్లు సమయానికి రావడంలేదనే విషయం లోతుగా పాతుకుపోయింది. వచ్చిన తళుక్కుమని మాయమవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకవేళ మధ్యాహ్నం వరకు ఉండి..ఆపై మీటింగ్, ఇతర కారణాలు చెప్పి విధులకు డుమ్మా కొట్టేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. దీంతో పల్లె వైద్యం పడకేసింది. సీజనల్ వ్యాధులు ముసురుకుంటున్నా వైద్యులు కానరావడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో పాటు మందులు, మాత్రలు దొరక్కపోవడంతో ఓపీ సంఖ్య ఇంకాస్త తగ్గుముఖం పట్టింది.

వారంలో కేసుల వివరాలు

కేసు రకం	పరీక్ష చేసినవారి సంఖ్య	నమోదైన కేసులు
జ్వరం	0	0
టైఫాయిడ్	384	30
మలేరియా	2540	1
డెంగీ	423	8

పీహెచ్‌సీ ఓపీల సంఖ్య

నెల	ఓపీ సంఖ్య
ఏప్రిల్	1,95,587
మే	2,19,915
జూన్	2,20,556
జూలై	1,96,665
ఆగష్టు	1,92,513

ప్రైవేటు ఆస్పత్రులే దిక్కు

పీహెచ్‌సీలు గాడితప్పడం, మందులు, మాత్రలు దొరక్కపోవడం, వైద్యులు అందుబాటులో లేకపోవడంతో పల్లె ప్రజలకు ప్రైవేటు ఆస్పత్రులే దిక్కుగా మారుతున్నాయి. మండల కేంద్రం, పట్టణ ప్రాంతాల్లోని ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. లేకుంటే ఆర్‌ఎంపీల వద్ద చూపించుకుంటున్నారు. ఇందుకు రవాణా ఛార్జీలు, ఆస్పత్రి ఫీజులతో జేబులు ఖాళీఅవుతున్నాయి. జ్వరానికి ప్రైవేటు ఆస్పత్రికి వెళితే రూ.600 నుంచి రూ.2 వేల వరకు ఖర్చువుతోంది. డెంగీ, టైఫాయిడ్ జ్వరమంటే రూ. 5 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చువుతోంది. ల్యాబ్ టెస్టులు అదనంగా మారింది.

ఇవీలేవు...



పీహెచ్‌సీల్లో చాలా వరకు మాత్రల కొరత అధికంగా ఉన్నాయి. పారాసెటమాల్ 500 ఎంజీ, 650 ఎంజీ(జ్వరం, తలనొప్పి), డైక్లోఫెనాక్(కీళ్ల సంబంధిత వ్యాధులకు), రాంటాక్ (కడుపునకు సంబంధించినవి), పాంటాప్ (గ్యాస్ట్రిక్), యాంటీబయాటిక్‌లతో పాటు మరో 10 రకాల మాత్రలు లేవు. అలాగే పారా సెటమాల్, అంబ్రోక్స్ (గొంతు, తదితర సమస్యలకు), సీపీఎం(అలర్జీ) సిరప్‌లు ఖాళీ అయ్యాయి. దీంతో పాటు పారాసెటమాల్ ఇంజెక్షన్, రాంటాక్, వోవెరాన్(కండరాలు, కీళ్లు), గాంటామిసిన్(యాంటీబయాటిక్), అమికాసిన్(చర్మం, ఊపిరితిత్తులు, తదితర వ్యాధులకు) అనే ఇంజెక్షన్‌లు కరువయ్యాయి. నెలల తరబడి ఇవీ సరఫరా కాకపోవడంతో పల్లె జనానికి ప్రాథమిక ఆరోగ్యం దూరమైంది.

మాత్రలు బయట కొనమంటున్నారు..



మోకాళ్ల నొప్పుల సమస్యలతో కొన్నేళ్లుగా బాధపడుతున్నా.. మందుల కోసం గవర్నమెంట్ ఆస్పత్రికి పోతే స్టాక్ లేదంటున్నారు. మాత్రలు బయటకొనమని చీటీలు రాస్తున్నారు. రూ.వందల్లో ఖర్చు అవుతోంది. ప్రైవేట్ ఆస్పత్రిలో చూపించుకునే స్తోమత లేకనే ఇక్కడికి వస్తున్నాం. ఇక్కడ కూడా మందులు బయటకు రాస్తున్నారు. మాలాంటి వాళ్లు ఏం చేయాలి.

– శ్రీనివాసులు, ఐరాల

కొన్ని రోజులుగా ఇలానే ఉంది..



విష జ్వరాలు వస్తున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందులు కొరత ఉంది. ఏ రోగానికి వెళ్లినా మందులు లేవని ఉన్నవాటితో సర్దుకుంటున్నారు. కొన్ని రోజులుగా ఇలానే ఉంది. జ్వరానికి మందులు, మాత్రలు లేవంటే మాలాంటి వాళ్లు ఇబ్బందులు పడక తప్పదు. ప్రభుత్వం స్పందించి మందులు, మాత్రలు ఇవ్వాలి.

–ధనపాల్, ఆముదాల, పాలసముద్రం మండలం

సెంట్రల్ డ్రగ్స్‌కు నివేదిక పంపాం



మందుల కొరత ఉందని మా దృష్టికి వచ్చింది. వెంటనే సెంట్రల్ డ్రగ్స్‌కు నివేదిక పంపాం . ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తాం. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారులకు సూచించాం. వారిని క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించాం. ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు ఇబ్బంది లేకుండా వైద్య సేవలు అందిస్తాం.

– సుధారాణి, డీఎంహెచ్‌ఓ, చిత్తూరు

విద్యుత్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న విశ్రాంత జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి

గంగాధర నెల్లూరు : ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని విశ్రాంత జడ్జి శ్రీనివాస ఆంజనేయ మూర్తి పిలుపు నిచ్చారు. గంగాధర నెల్లూరు విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయంలో బుధవారం విశ్రాంత జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి అధ్యక్షతన ప్రత్యేక విద్యుత్ అదాలత్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎక్కడైనా విద్యుత్ సమస్యలు ఏర్పడినప్పుడు సకాలంలో సంబంధిత సిబ్బంది పరిష్కరించి వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ సాంకేతిక ఆర్థిక సభ్యులు మధుకుమార్, స్వతంత్ర సభ్యులు విజయలక్ష్మి , విద్యుత్‌శాఖ ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్, ఈఈ. సురేష్ కుమార్, డీఈలు శేషాద్రి రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, చంద్రబాబు, గంగాధర నెల్లూరు , ఆవలకొండ విద్యుత్ శాఖ ఏఈలు వరదరాజులు, తనిగవేలు పలువురు విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులకు కలెక్టర్ అభినందన

చిత్తూరు కలెక్టరేట్ : జాతీయ స్థాయి లేజర్ రన్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ సాధించిన చిత్తూరు క్రీడాకారులను కలెక్టర్ సుమిత్ కుమార్ అభినందించారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో ఆ క్రీడాకారులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. బీహార్ రాష్ట్రం బెంగుసారాలో ఈ నెల 4 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించిన 9వ జాతీయ స్థాయి లేజర్ రన్ పోటీల్లో చిత్తూరు విద్యార్థులు ప్రతిభ చాటడం అభినందనీయమన్నారు. ఈ పోటీల్లో అర్హత పొంది అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి సాయి భార్గవ్‌ను అభినందించారు. ఈ విద్యార్థి దేశం తరపున సౌత్ ఆఫ్రికాలో డిసెంబర్ 7 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించే అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంటారన్నారు. అనంతరం ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు సర్టిఫికెట్, మెడల్స్ అందజేసి అభినందించారు.



విద్యార్థినిని అభినందించి సర్టిఫికెట్ అందజేస్తున్న కలెక్టర్

సీఎం సేవలో ఆర్టీసీ

- జిల్లాలోని ఆర్టీసీ బస్సులు సీఎం సభకు మళ్లింపు
- జిల్లా నుంచి 300 బస్సులు తరలింపు
- బస్సుల్లేక ప్రయాణికుల కష్టాలు



చిత్తూరు బస్టాండ్‌లో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : సీఎం చంద్రబాబు వివిధ ప్రాంతాల్లో పర్యటించే ప్రతిసారీ ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. సీఎం పాల్గొనే సభలను విజయవంతం చేసే ప్రయత్నంలో భాగంగా ఆర్టీసీ బస్సులను వాడుకుంటున్నారు. ఈ విషయం ముందస్తుగా తెలియక పోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఆర్టీసీ యాజమాన్యం ఇవేమీ పట్టనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

జిల్లాతో పాటు ఇతర జిల్లాలో జరిగే సీఎం చంద్రబాబు పర్యటనకు ఆర్టీసీ బస్సులు వాడుకుంటున్నారు. ఈ క్రమంలో బుధవారం అనంతపురం జిల్లాలో జరిగే సభకు జిల్లాలోని బస్సులను తరలించారు. అక్కడ సభను విజయవంతం చేసేందుకు జిల్లా బస్సులను పంపించేశారు. మంగళవారమే బస్సులన్నీ జిల్లాలోని వివిధ ప్రాంతాలకు తరలించారు. దీంతో బుధవారం ఉదయం నుంచి జిల్లాలో బస్సుల కొరత వేధించింది. బస్సుల్లేక ప్రయాణికులు అగచాట్లు పడ్డారు. జిల్లాలోని ఐదు డిపోల పరిధిలో 426 బస్సులుంటే 300 బస్సులను సభకు పంపించేశారు. ఇందులో తిరుపతి, వేలూరు, బెంగుళూరు మార్గాల్లో తిరిగే బస్సులు అధికంగా ఉన్నాయి. పల్లె వెలుగు బస్సులను సైతం వదల్లేదు.

ముందస్తు సమాచారం లేకుండా..

ఆర్టీసీ బస్సులను సీఎం సభకు తరలిస్తారనే ముందస్తు సమాచారం లేకపోవడంతో బుధవారం ఉదయం నుంచే ప్రయాణికులు బస్టాండుకు వచ్చి షాక్‌కు గురయ్యారు. గమ్యం చేరుకోవడానికి పడిగావులు పడ్డారు. డొక్కు బస్సులు తప్ప మిగిలిన సూపర్ లగ్జరీ, ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగుతో సహా సభకు తరలించారు. ఫలితంగా గ్రామాలు, మండల కేంద్రాలకు రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు పడ్డారు.

ప్రైవేటు వాహనాలే దిక్కు..



కర్ణాటక ఆర్టీసీలో ఎక్కేందుకు పోటీ పడుతున్న ప్రయాణికులు



చిత్తూరు ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికులను ఎక్కించుకుంటున్న ప్రైవేటు వాహనం

డిపోల వారీగా సీఎం సభకు తరలించిన బస్సుల సంఖ్య

చిత్తూరు వన్ డిపో	చిత్తూరు టూ డిపో	కుప్పం	పలమనేరు	పుంగనూరు
58	68	71	47	56

గంటల తరబడి బస్టాండుకు బస్సులు రాకపోయే సరికి ప్రైవేటు వాహనాలు, ఆటోలను ఆశ్రయించాల్సి వచ్చింది. బస్సులను సభకు పంపిన విషయంపై సమాచారం లేకపోవడంతో ప్రయాణికులు ఆర్టీసీ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. ఇదే అవకాశంగా ప్రైవేటు వాహనాదారు లు రెచ్చిపోయారు. ఏకంగా చిత్తూరు ఆర్టీసీ బస్టాండుకే వాహనాలను తీసుకొచ్చి ప్రయాణికులను ఎక్కించుకొని వెళ్లారు. ప్రయాణికులపై చార్జీల మోత వేశారు.

పట్టించుకోని అధికారులు

ఆర్టీసీ ఇష్టానుసారంగా బస్సులను సీఎం సభలకు మళ్లించి. జిల్లా పర్యటనతో పాటు ఏ జిల్లాలో సభ జరిగినా ఆర్టీసీ అధికారులు అప్పన్నంగా బస్సులను పంపుతున్నారు. ప్రయాణికుల కష్టాలను పట్టించుకోకుండా ఎప్పుడు పడితే అప్పుడు బస్సులను మళ్లించడం ఆర్టీసీకి పరిపాటిగా మారిందని పలువురు ప్రయాణికులు మండిపడుతున్నారు.

క్లుప్తంగా

భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తాం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): పెరటాసినెలను పురస్కరించుకుని తమిళనాడు, కర్ణాటక రాష్ట్రం నుంచి చిత్తూరు మీదుగా కాలినడకన వెళ్లే భక్తులకు అన్నదానంతో పాటు వసతి కల్పిస్తున్నామని తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద ట్రస్టు సభ్యులు పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ట్రస్టు సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈనెల 17 నుంచి అక్టోబర్ 10 వతేదీ వరకు అన్నదానం, వసతి కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సభ్యులు ఈశ్వర్, హరిప్రసాద్ రెడ్డి, మల్లి ఆచ్చారి, సుబ్రి, తిరుకుమారన్, సిద్దు, గజ, బాలాజీ, జయకుమార్ పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీల నియామకం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) సెక్రటరీలను నియమిస్తూ రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో ఎస్‌జీఎఫ్ అండర్ 14,17,19 సెక్రటరీలను నియమించారు. అండర్–14, 19 సెక్రటరీగా ఐరాల ప్రభుత్వ హైస్కూల్ పీడీ డా.ఎస్.బాబుకు అప్పగించారు. అలాగే అండర్– 17 సెక్రటరీగా చిత్తూరులోని సంతపేట పీఎస్‌సీ మున్సిపల్ హైస్కూల్ పీడీ శారదను నియమించారు.

విధులకు హాజరుకాకపోతే తొలగిస్తాం

కుప్పం : ద్రావిడ విశ్వవిద్యాలయంలో దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిన తాత్కాలిక ఉద్యోగులు వెంటనే విధులకు హాజరు కావాలని వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్ కుమార్ ఆదేశించారు. పలువురు ఉద్యోగులు పలు కారణాలు చెప్పి దీర్ఘకాలిక సెలవులు పెట్టారని అన్నారు. అయితే అటువంటి ఉద్యోగులు వెంటనే విధులకు హాజరు కాకపోతే వారిని తొలగిస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు వర్సిటీలోని అన్ని విభాగాధిపతులకు ఆదేశాలు జారీ చేశారు.

పంట పొలాలపై ఏనుగుల దాడి



పాతపేటలోని సురేష్ కొబ్బరి చెట్టను విరిచేసిన ఏనుగులు

పులిచెర్ల(కల్లూరు) : మండలంలోని పాతపేట పంచాయతీలో బుధవారం తెల్లవారు జామున ఏనుగుల గుంపు పంట పొలాలపై పడి నాశనం చేశాయి. తాజాగా పాతపేటలో సురేష్ తోటలో కొబ్బరి చెట్లను ధ్వంసం చేసి విరిచేయడంతో పాటు పక్క పొలాల్లో డ్రిప్ పరికరాలు, మామిడి కొమ్మలు ధ్వంసం చేశాయి.

పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు.. ప్రజాస్వామ్యానికి ప్రమాదం



విజయసింహారెడ్డి, రిటైర్డ్ తహసీల్దార్, చిత్తూరు.

పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేస్తే ప్రజాస్వామ్యానికి ప్రమాదం. ఇలాంటి విధానాల వల్ల సమన్యాయం, అభివృద్ధి, రాజ్యాంగ విలువల పరిరక్షణ ఆందోళనకరంగా మారుతుంది. పత్రికా స్వేచ్ఛ, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, భద్రత లాంటివి రేపటి సమ సమాజ స్థాపనకు ఊతమిచ్చే విధంగా ప్రభుత్వం ఉండాలే కానీ, గొంతు నొక్కేలా వ్యవహరించకూడదు. అలా నిజాల్ని మరుగున పరిచే విధంగా వ్యవహరిస్తే భవిష్యత్తు తరం పాలకవర్గాలను క్షమించదన్న విషయం గమనించుకోవాలి. పత్రికా స్వేచ్ఛ మీద న్యాయస్థానాల్లో ఎన్నో ల్యాండ్ మార్క్ జడ్జిమెంట్లు ఉన్నాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాశాడనే కారణంగా జర్నలిస్టు మీద క్రిమినల్ కేసులు పెట్టవద్దని గతంలోకి లక్నోకి చెందిన కేసులో సుప్రీం కోర్టు చాలా విస్పష్టమైన ఆదేశాలిస్తూ పత్రిక స్వేచ్ఛ పట్ల సంచలన వ్యాఖ్యలు చేసింది. అసలు భారతదేశంలో పత్రికలకు ఉన్న రాజ్యాంగపరమైన హక్కుల గురించి స్పష్టంగా తెలుసుకుంటే జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయించాలనే ప్రయత్నాలు చేయరు.



కక్ష సాధింపులకు మూల్యం చెల్లించుకోక తప్పదు

రాష్ట్రంలో పరిస్థితులు దారుణంగా తయారయ్యాయి. ప్రజాస్వామ్యం అపహాస్యం అయ్యేలా కూటమి ప్రభుత్వం ప్రవర్తిస్తోంది. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగే విధంగా వ్యవహరించడం దారుణం. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పత్రికల్లో వార్తలు వస్తే తమకు మింగుడుపడని పక్షంలో ఖండించాలి తప్ప కక్ష సాధింపు చర్యలకు దిగడంతో ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతింటుంది. సాక్షి ఎడిటర్‌పై అక్రమ కేసులు బనాయించి నోటీసులు జారీచేయడం మేధావి వర్గాలు, జర్నలిస్టులు ఆలోచించాల్సిన విషయం. వ్యవస్థలను తమ చేతులోకి తీసుకుని ఇష్టానుసారంగా పాలన కొనసాగిస్తే అందుకు తగిన మూల్యం భారీ స్థాయిలో చెల్లించుకోక తప్పదు. ప్రజలు హర్షించే విధంగా ప్రభుత్వ పాలన కొనసాగాలి కానీ ప్రస్తుతం రాష్ట్రంలో అలాంటి పరిస్థితులు కనబడలేదు. ఇకనైనా పత్రికల యాజమాన్యాలపైన, జర్నలిస్టులపైనా కేసులు పెట్టే సంస్కృతి మానుకుని ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వ దృష్టి సారించాలి



మునిరామిరెడ్డి, విశ్రాంత అధ్యాపకులు, తిరుపతి

ప్రతి పనికీ ఓ రేటు!

- ఆర్‌అండ్‌బీలో వసూళ్ల పర్వం
- రూ.లక్షల్లో ఆర్జిస్తున్న అధికారులు
- ముడుపులు ముట్టచెబితేనే పనులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : మూడు పువ్వులు.. ఆరు కాయలు అన్నట్లు లాభంగా మారింది ఆర్‌అండ్‌బీశాఖ తీరు. ప్రతిపనికి రూ.వేలు, లక్షలు ఇచ్చినా సకాలంలో పనులు కావడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయి. సిబ్బంది కొరత, పనుల అవసరాన్ని సాకుగా చూపుతూ రూ.లక్షలు గడిస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. జిల్లా ఆర్‌అండ్‌బీ శాఖలో బిల్లులు పాస్ కావాలన్న, ఫైల్స్ అనుమతి పొందాలన్న భారీ మొత్తంలో ముడుపులు ముట్టజెప్పాల్సిందేనని కాంట్రాక్టర్లు, బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలల తరబడి కార్యాలయాలకు తిప్పించుకుంటూ వేధిస్తున్నారని వాపోతున్నారు.

సిబ్బంది కొరత సాకుగా చూపి

జిల్లాలో మొత్తం 12 మంది ఏఈలకు 9 ఏఈలు, కార్యాలయ సిబ్బంది ఆరుగురు కొరత ఉన్నారు. దీంతో సిబ్బంది కొరతను సాకుగా చూపుతూ పనులను ఆలస్యమవుతున్నట్లు అధికారులు సర్ది చెప్పుకుంటున్నారు. కూటమి అధికారంలో వచ్చాక పల్లెపండుగ పేరిట జిల్లాలో రోడ్డు మరమ్మతు పనులను రూ.21.53 కోట్లు కేటాయించారు. ఇందుకు సంబంధించిన బిల్లుల చెల్లింపులోనూ పర్సంటేజీ వసూళ్లు చేశారు. జిల్లాలో పలు పద్దుల కింద దాదాపు రూ.250 కోట్ల పనులు మంజూరవ్వగా అందులో పలు రకాల పనులు క్షేత్రస్థాయిలో జరుగుతున్నాయి. ఇందులోను స్టేజ్ వారీగా బిల్లులు పాస్ కావాలంటే పలుకుబడి ఉంటే 5,3,2 శాతం పర్సంటేజీలు ఇవ్వాల్సిందేనని ఆరోపణలు ఉన్నాయి.

అనుమతి పేరుతో మామూళ్లు

కోళ్ల ఫారం, టపాసులు గోదాము, కాలేజీ భవనం, కల్యాణ మండపాలు. హోటల్స్, షాపింగ్ మాల్స్ ప్రయివేటు ఆస్పత్రి భవనాల ఎన్‌ఓసీకి దండుకుంటున్నారు. వ్యాలువేషన్ బట్టి రూ.50 నుంచి రూ.1.50 లక్ష వరకు వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. రోడ్డు వేసే కాంట్రాక్టుల నుంచి ప్రతి బిల్లుకు రూ. 15 నుంచి 20 శాతం ఇవ్వాలనే ఆరోపణలున్నాయి. క్వాలిటీ కంట్రోల్ పేరుతో నాసిరకంగా ఉన్నా మామూళ్లకు అమ్ముడుపోయి...వదిలేస్తున్నారనే విమర్శలున్నాయి.



జిల్లా ఆర్‌అండ్‌బీ కార్యాలయం
కనిపించని నాణ్యత

పల్లె పండుగ పేరిట గత వర్షాకాలంలో ప్రారంభించి ఈ మార్చిలో 1500 కిలోమీటర్లు రోడ్డు మరమ్మతు పనులు చేశారు. కానీ ఏమి లాభం రోడ్డు వేసిన 6 నెలలకే తిరిగి గుంతలు పడ్డాయి. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా పనులు జరుగుతున్నా పర్యవేక్షణ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఓ అధికారి సెలవురోజు ఓ కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసి మరీ డబ్బులు తీసుకున్నట్లు తెలుస్తోంది. దీనికి తోడు చేబదులు రూపంలో రూ.లక్షలో తీసుకొని తమకు ఇవ్వాల్సిన మామూళ్లలో పట్టుకోమని చెబుతున్నారని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఆర్‌కేఎం పురం వద్ద అధ్వాన్నంగా రహదారి

ఇవిగో ఆధారాలు ఇలా..

- నగరంలో కొత్త బస్టాండ్ సమీపంలోని ఓవర్ బ్రిడ్జి కింద అనధికారంగా దుకాణం ఏర్పాటు చేశారు. ఆర్‌అండ్‌బీ అధికారులకు మామూళ్లు ఇచ్చి వ్యాపారం చేస్తున్నారనే వాదన ఉంది.
- పూతలపట్టుకు చెందిన ఓ రోడ్డు కాంట్రాక్టర్ లైసెన్సు రెన్యూవల్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఎంతకు పనికాకపోవడంతో రూ.25 వేలు సంబంధిత క్లర్క్‌కు ఇచ్చాడు. వెంటనే పని చేసి రెన్యూవల్ అనుమతి ఇచ్చేశారు.
- పలమనేరులో సినిమా థియేటర్ రెన్యూవల్ లైసెన్స్ కోసం అడిగినంత ఇచ్చాక వేగంగా అనుమతులు ఇచ్చారు.
- పుంగనూరు, కుప్పంలో టపాసుల గోడౌన్ ఎన్‌ఓసీ కోసం ఇద్దరు దరఖాస్తు చేసుకున్నారు. ఏఈ గోడౌన్ పర్యవేక్షించి ఫైల్‌ను ఉన్నతాధికారులకు పంపాలి. కానీ వారాల తరబడి వేచిచూసిన ఆయన రాకపోవడంతో నిర్వాహకులు కార్యాలయానికి వెళ్లి ప్రాధేయపడి రప్పించుకున్నారు. తీరా అనుమతి ఇవ్వడానికి పలు కొర్రీలు పెట్టడంతో రూ.1.50 లక్షలు లంచం ఇచ్చాక అనుమతి ఇవ్వడానికి అంగీకారం తెలిపినట్లు సమాచారం.
- జిల్లాలో ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, కల్యాణ మండపాలు ప్రతి పని అనుమతికి లక్షలు ఇవ్వనిదే పనులు కావడం లేదు. డబ్బులు ఇచ్చినా పలుకుబడి లేనిదే వేగంగా పనులు కావడం లేదు. ఏఈ, డీఈలు క్షేత్రస్థాయిలో పనులు చూడాలంటే కాంట్రాక్టర్లు కారులో తీసుకొని తిప్పాలి. పనులు అయ్యాక విందు ఏర్పాటు చేయాల్సిందేనని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డబ్బులడిగితే ఫిర్యాదు చేయండి

ఆర్‌అండ్‌బీ పరిధిలో పనులు చేసుకోవడానికి డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు. నిబంధనల ప్రకారం సరైన ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తే చాలు. బిల్లులు, ఎన్‌ఓసీ పరంగా అదనంగా చెల్లించాల్సిన అవసరం లేదు. ఎవరైన డబ్బులు అడిగితే ఫిర్యాదు చేయండి.

– శ్రీనివాసులు, ఈఈ, ఆర్‌అండ్‌బీ

ఇష్టారాజ్యంగా అక్రమ తవ్వకాలు



మైనింగ్ అనుమతిని వివరిస్తున్న తహసీల్దార్ ఎస్‌ఐ

పాలసముద్రం : మండలంలోని వనదుర్గాపురం పంచాయతీ జగనన్న కాలనీ సమీపంలోని గుట్టలో కూటమి నేతలకు ఎర్రమట్టి గ్రావెల్ మంజూరైంది. కానీ బుధవారం అనుమతి పేరుతో ఎక్కడ ఎర్రమట్టి బాగుందో అక్కడ కూటమి నాయకులు హిటాచీతో ఎర్రమట్టిని టిప్పర్‌లలో తమిళనాడుకు తరలించి డబ్బులు సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు తహసీల్దార్ అరుణ కుమారి , ఎస్‌ఐ చిన్నరెడ్డప్పకు వివరించారు. వారు సంఘటన స్థలానికి చేరుకునే లోగానే వారికి మంజూరైన ప్రదేశానికి హిటాచీలను, టిప్పర్‌ని తరలించారు. వారికి మంజూరైన చోటులో సర్వేయర్ సహాయంతో హద్దులు చూపించారు. ఇందులో చుట్టు పక్కల 30 అడుగులు వదిలేసి మిగిలిన చోటనే మట్టిని తీసుకోవాలన్నారు. అలా కాకుండా ఇష్టానుసారం మట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మరో వైపు పంచాయతీ ఇచ్చిన తీర్మానంలో 2.95 హెక్టార్లకు క్వారీకి అనుమతి ఇచ్చినట్టు ఉంది. కాగా మైనింగ్ అధికారులు ఇచ్చిన అనుమతిలో 4.900 హెక్టార్లలో క్వారీకి అనుమతి ఇచ్చినట్లు పరస్పర విరుద్ధంగా అనుమతులు ఉండడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

డ్రాపౌట్స్ తగ్గింపునకు చర్యలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో బడి బయట పిల్లలు (డ్రాపౌట్స్) తగ్గింపునకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో బడిబయట పిల్లలను గుర్తించి వారిని తిరిగి పాఠశాలల్లో చేర్పించాలన్నారు. జిల్లాలో జూలై 2025 నాటికి 4202 మంది విద్యార్థులను బడిబయట పిల్లలుగా గుర్తించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 1997 మంది విద్యార్థులను తిరిగి వివిధ పాఠశాలల్లో చేర్పించారన్నారు. పాఠశాలల్లో చేరిన బడి బయట విద్యార్థుల వివరాలను ఎంఈవోలు పాఠశాల వారీగా ప్రత్యేక ప్రొఫార్మాలో వివరాలు అందజేయాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని పక్కాగా మెనూ ప్రకారం అమలు చేయాలని తెలిపారు. నాణ్యత లోపిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష శాఖ ఏపీసీ వెంకటరమణ, విద్యాశాఖ ఏడీ–1 సుకుమార్, ఎంఈవోలు, హెచ్ఎంలు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎంఈవోలు, హెచ్ఎంలు

పంచాయతీల అభివృద్ధిలో భాగస్వాములవ్వాలి

గుడిపాల : పంచాయతీల అభివృద్ధిలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకంగా ఉండాలని జెడ్పీ సీఈఓ రవికుమార్, జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్‌రావు అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 15వ ఆర్థిక సంఘం నిధులు ఆయా పంచాయతీలకు జమ చేయడం జరిగిందని వాటిని ముఖ్యంగా పారిశుద్ధ్యం, తాగునీటికి ఉపయోగించుకోవాలన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద గుడిపాల మండలంలోని ఎస్సీలు అధికంగా ఉన్న పశుమంద, వెంగమాంబపురం, కొత్తపల్లె, శ్రీరంగంపల్లె, మరకాలకుప్పం గ్రామాలకు రూ.20 లక్షలు మంజూరైందని వీటిని సీసీ రోడ్లు మినహా మిగతా పనులను గుర్తించి ప్రతిపాదనలు తయారు చేయాలని ఆయన వారికి తెలియజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో కుమార్, డిప్యూటీ ఎంపీడీవో కృష్ణప్రసాద్, పంచాయతీరాజ్ ఏఈ ప్రసాద్‌నాయుడులు , తదితరులు పాల్గొన్నారు.



గుడిపాల : సమావేశంలో ప్రసంగిస్తున్న సీఈఓ రవినాయుడు

సూపర్ సిక్స్ అట్టర్ ఫ్లాప్

- విజయవంతం సభలు హాస్యాస్పదం
- కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : తమ దృష్టిలో సూపర్‌సిక్స్ హిట్ కాదని... సూపర్ ఫ్లాప్ అని కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి ధ్వజమెత్తారు. చిత్తూరు నగరంలోని ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించారన్నారు. 50 లక్షల మంది నిరుద్యోగులకు రూ.3 వేల చొప్పున భృతి ఇస్తామని..ఇంత వరకు ఇవ్వలేదన్నారు. అలాగే 20 లక్షల మంది ఉద్యోగాలు ఇస్తామని..ప్రైవేటు కంపెనీల ఒప్పందం పేరుతో హడావుడి చేస్తోందన్నారు. ఎన్నికలప్పుడు అన్నదాత సుఖీభవ పథకం పేరుతో రైతులకు రూ.20వేలు ఇస్తామన్నారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.6వేలు కలిపి రూ. 20వేలు ఇస్తున్నారని, పలు రకాల కారణాలు చెబుతూ పథకంలో కోతలు పెట్టారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 ఏళ్లకు పింఛన్ ఇస్తామని...అమలుపై నోరెత్తడం లేదన్నారు. మానవత్వం లేకుండా రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల మంది దివ్యాంగులకు అడ్డగోలుగా పింఛన్లను తొలగించారన్నారు. వితంతులకు పింఛన్లు లేవన్నారు. యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు. ఇలాంటప్పుడు సూపర్‌సిక్స్ విజయవంత సభల నిర్వహించుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. విభజన హామీలపై కూటమి ప్రభుత్వం కేంద్రాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను ఎందుకు మోదీకి తాకట్టుపెట్టారన్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యురాలు సుంకర పద్మశ్రీ, కిల్లి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి

కొరమీను చేపల పెంపకంతో ఆదాయం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో మహిళా రైతులు కొరమీను చేపల పెంపకంతో అధిక ఆదాయం పొందవచ్చని డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి అన్నారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ కార్యాలయంలో వ్యవసాయ మహిళా రైతు సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ.. కనీసం 5 సెంట్లు భూమి, బోరుబావి, నీటి సౌకర్యం ఉన్న ప్రతి మహిళా సభ్యురాలు ఈ అభివృద్ధి కార్యక్రమం చేసుకోవచ్చన్నారు. అర్హులైన వారికి ఆక్వా సంస్థ నుంచి కొరమీను చేప పిల్లల పంపిణీ, షెడ్డు, తదితర యంత్ర పరికరాలు సమకూరుస్తామన్నారు. ఈ యూనిట్ విలువ మొత్తం రూ.4,41,000 అన్నారు. ఆసక్తి ఉన్న వారికి పీఎంఈజీపీలో 35 శాతం సబ్సిడీతో రుణం అందజేస్తారని తెలిపారు. ఉదయ్ ఆక్వా సంస్థ ఎండీ ఉదయ్ కిషన్ మాట్లాడుతూ.. దిగుబడి తర్వాత కొరమీను చేపలను కొనుగోలు చేసి మార్కెటింగ్ చేసి మంచి మద్దతు ధర అందజేస్తామని తెలిపారు. సమావేశంలో గిరింపేట ఇండియన్ బ్యాంక్ మేనేజర్ మురళీకృష్ణ, డీపీఎం రవికుమార్ పాల్గొన్నారు.

చంద్రప్రభపై వరసిద్ధుడు

కాణిపాకం : ప్రత్యేక ఉత్సవాలను పురస్కరించుకుని కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి బుధవారం చంద్రప్రభ వాహనంపై కటాక్షించారు. తొలుత మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకం చేశారు. చందన అలంకారం చేసి విశేష పూజలు నిర్వహించారు. రాత్రి అలంకార మండపంలో సిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి వారి ఉత్సవమూర్తులకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం చంద్రప్రభ వాహనంపై కొలువుదీర్చారు. మంగళ వాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ మాడ వీధుల్లో ఊరేగించారు. చంద్రప్రభ వాహన సేవలో భాగంగా ఉభయదారులు క్షీర కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. ప్రధాన ఆలయ కల్యాణ వేదికలో ఉత్సవమూర్తి విగ్రహానికి పాలాభిషేకం చేశారు.

నేడు కల్పవృక్షవాహనం

కాణిపాక ఉత్సవంలో భాగంగా గురువారం స్వామివారు కల్పవృక్ష వాహనంలో ప్రత్యక్షమవనున్నారని ఈవో పెంచలకిషోర్ తెలిపారు. రాత్రి కల్పవృక్షవాహన సేవ ఉంటుందన్నారు.



చంద్రప్రభ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఈవో, ఉభయదారులు

ఆటో అదుపు తప్పి .. గాయాలు

- దుర్గసముద్రం వద్ద ప్రమాదం
- గాయాలైన 9 మంది గొదమాకులపల్లె కూలీలు
- ముగ్గురి పరిస్థితి ఆందోళకరం



దుర్గసముద్రం వద్ద ఘటనా స్థలంలో దూసుకెళ్లిన ఆటో



తీవ్రంగా గాయపడిన హేమశ్రీ, హారతి, డ్రైవర్ విశ్వనాథ్, మంజుల

చౌడేపల్లె : అయ్యో.. పొట్టనింపుకోవడానికి కూలీ పనుల కోసం వచ్చి పనులు ముగించుకొని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా దుర్గసముద్రం వద్ద జరిగిన ఆటో ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రాణాలపైకి తెచ్చుకొన్న ఘటన బుధవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పెద్దపంజాణి మండలం గొదమాకులపల్లెకు చెందిన కొందరు ఆటోలో చౌడేపల్లె మండలం ఎర్రప్పల్లె వద్ద టమోటా తోటలో కూలీ పనుల కోసం వచ్చి తిరుగు ప్రయాణంలో దుర్గసముద్రం వద్ద వెళ్తుండగా గుత్తివారిపల్లెకు చెందిన ఆటో డ్రైవర్ విశ్వనాథ్ (38)కు ఫిట్స్ రావడంతో వాహనంను రోడ్డు పక్కనే ఉన్న శంకరప్ప ఇంటిలోకి ఆటో వేగంగా దూసుకెళ్తు ఎదురుగా ఉన్న రాతి కూసాలు, గోడను ఢీకొని ఆటో ఆగింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్నహే మశ్రీ (32)మంజుల (35)హారతి (18) టి.మంజుల(40)లక్ష్మమ్మ(45) సుబ్బమ్మ(52) లతో పాటు మరో ఇద్దరికి గాయాలైయ్యాయి.స్థానికులు ప్రవేటు వాహనంలో చౌడేపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా వీరిలో మంజుల, హారతి, హేమశ్రీల పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మదనపల్లెకు రెఫర్ చేశారు. సుమారు గంట సేపు 108 వాహనం కోసం క్షతగాత్రులు ఎదురు చూడాల్సి వచ్చింది. ఎదురుగా వాహనంను ఢీకొని ఉంటే పెద్ద ప్రాణ నష్టం సంభవించేదని కూలీలు ఆందోళనకు గురయ్యారు. సమాచారం తెలుసుకొన్న ఎస్‌ఐ నాగేశ్వరరావు ఘటనా స్థలాన్ని చేరుకొని కేసు నమోదుచేసి దర్యాప్తు చేపడుతున్నారు.

వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శిగా టి.వెంకటేష్

చిత్తూరు కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ విభాగం సంయుక్త కార్యదర్శిగా శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన టి.వెంకటేష్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలియజేసింది.

బైక్‌ను ఢీకొన్న కంటైనర్

బంగారుపాళెం : మండలంలోని మొగిలి ఘాట్ దొరచెరువు వద్ద చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ ఉద్యోగి మృతి చెందాడు. పోలీసుల తెలిపిన వివరాల మేరకు..గంగవరం మండలం అత్తిశెట్టిపల్లెకు చెందిన వెంకటరామిరెడ్డి కుమారుడు పవన్ (26) పలమనేరులో ఓ ఫైనాన్స్ కంపెనీలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఇందులో భాగంగా కలెక్షన్ కోసమని పలమనేరు నుంచి బంగారుపాళ్యానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా మార్గ మధ్యలో మొగిలి ఘాట్ దొరచెరువు వద్ద బెంగళూరు నుంచి చెన్నై పోతున్న కంటైనర్ వేగంగా వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో పవన్ తీవ్రంగా గాయపడి సంఘటనా స్థలంలో మృతి చెందాడు.

కలశ శోభితం



ప్రత్యేక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో గురువారం జరిగే కల్పవృక్ష సేవకు ఆలయం పుష్పశోభితమైంది. ఆలయ ముఖద్వారం నుంచి ఆవరణ అంతా రకరకాల పుష్పాలతో అలంకరింపజేశారు. కలశాలతో ఊరేగింపుగా వచ్చారు. అలాగే పుష్పాలతో వినాయకస్వామి ప్రతిమను తీర్చిదిద్దారు. – కాణిపాకం